
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం ׀ 9 ׀ జనవరి ׀ 2025



సోమశిలలో 71.363 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో బుధవారం 71.363 టీఎంసీల నీరుంది. వివిధ కాలువలకు 3200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.79,870
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.7,242
3శాతం జీఎస్టీతో	రూ.7,460
నవర (8గ్రా)	రూ.59,680

గరిష్టం/కనిష్టం
29.9 /22.5

వాతావరణం


జిల్లాలో వాతావరణం గురువారం సాధారణంగా ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ బుధవారం 68 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

14న బ్రాహ్మణక్రాకలో ఎడ్ల బండలాగుడు పోటీలు

జలదంకి: మండలంలోని బ్రాహ్మణక్రాక గ్రామంలో ఈ నెల 14న రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏడాది సంక్రాంతి సంబరాల్లో భాగంగా బ్రాహ్మణక్రాక శివాలయం వద్ద ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోటీలలో విజేతలైన ఎడ్ల యజమానులకు ప్రథమ బహుమతి రూ.50 వేలు, ద్వితీయ బహుమతి రూ.40 వేలు, తృతీయ బహుమతి రూ.30 వేలు, నాల్గో బహుమతి రూ.20 వేలు, ఐదవ బహుమతి రూ.15 వేలు అందిస్తామన్నారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతి రూ.5 వేలు ఉంటుందన్నారు. ఆసక్తి గల ఎడ్ల యజమానులు 90103 24652, 91820 43989 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఆత్మీయ సమావేశంలో కూటమి నేతల అలకలు



వింజమూరు (ఉదయగిరి): వింజమూరులో బుధవారం జరిగిన ఉదయగిరి నియోజకవర్గ స్థాయి కూటమి పార్టీల (టీడీపీ, జనసేన, బీజేపీ) నేతల ఆత్మీయ సమావేశం అలకలకు వేదికైంది. పార్టీ శ్రేణులను ఆప్యాయంగా పలకరించే నిమిత్తం ఎంపీ వేమిరెడ్డి ఈ సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశ సమన్వయ బాధ్యత ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు అప్పగించారు. అయితే సమావేశంలో కొంతమంది సీనియర్ టీడీపీ నేతలను స్టేజీ మీదకు ఆహ్వానం లేకపోవడంతో అలకబూనారు. పార్టీకి ఎంతో సేవ చేసినా తమకు ప్రాధాన్యత ఇవ్వకపోడంపై అసంతృప్తితో మౌనంగా ఉండిపోయారు. సమావేశంలో పాల్గొన్న పలువురు నేతలకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. సమావేశం మధ్యలోనే మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖరరెడ్డి వెళ్లిపోయారు.

పంచాయతీల్లో పన్నులు వందశాతం వసూలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఓ శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు (పొగతోట): పంచాయతీల్లో వాటర్, హౌస్ ట్యాక్స్‌లను వందశాతం వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని డీపీఓ శ్రీధర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం జెడ్పీ సమావేశ మందిరంలో డీఎల్‌పీఓలు, ఈఓపీఆర్‌డీలు, ఇతర అధికారులతో నిర్వహించిన సమావేశంలో డీపీఓ మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరిచేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. స్వామిత్ర కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయాలన్నారు. వీధిలైట్లు పూర్తి స్థాయిలో వెలిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

కుష్టు రహితంగా జిల్లాను మారుద్దాం

- 14 రోజుల పాటు ఇంటింటి సర్వే



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్


నెల్లూరు రూరల్: జిల్లాను కుష్టురహితంగా చేయడానికి సంబంధిత అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ఓ ఆనంద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని శంకరన్‌హాల్‌లో కో ఆర్డినేషన్ కమిటీ సమావేశంలో కలెక్టర్ అధ్యక్షతన కరపత్రాలు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి 14 రోజుల పాటు ఇంటింటా సర్వే చేయాలని, ప్రజల్లో శాస్త్రీయమైన అవగాహన కల్పించాలని సూచించారు. సర్వే చేపట్టే ముందే టీంలకు పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వాలని, వ్యాధిగ్రస్తులతో పనిచేసే స్వచ్ఛంద సంస్థల సహాయం తీసుకుని వారిని భాగస్వాములను చేయాలని సూచించారు. సర్వేలో గ్రామ పంచాయతీ సిబ్బంది, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి వి సుజాత, అడిషనల్ డీఎంహెచ్ఓ ఖాదర్‌వలీ, జెడ్పీ సీఈఓ విద్యారమ, మెప్మా పీడీ రాధమ్మ, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సుశీల, ఆశా కోఆర్డినేటర్ మంజులమ్మ, డిప్యూటీ డీఈఓ లక్ష్మీప్రసన్న, డెమో అధికారి కనకరత్నం తదితరులు పాల్గొన్నారు.



మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఉమ్మడి నెల్లూరు జిల్లా నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ పి.చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు అనిల్‌కుమార్ యాదవ్, ఆర్.ప్రతాప్‌కుమార్‌రెడ్డి, కె.సంజీవయ్య, మాజీ ఎంపీ ఆదాల, నేతలు మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, విజయకుమార్‌రెడ్డి, రామ్‌కుమార్‌రెడ్డి తదితరులు



ఈ సందర్భంగా దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్ జగన్, పార్టీ జిల్లా నేతలు



రెడ్‌క్రాస్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ నిర్వీర్యానికి కుట్ర





సేవకు నారాయణ చెదలు

రెడ్‌క్రాస్ అంటేనే సేవకు ప్రతిరూపం. ఇందులోని సభ్యులు జాతి, మత, కుల, వర్గ, వర్ణ వయో భేదాలు లేకుండా ప్రజలకు సేవ చేస్తుంటారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు కుటుంబ సభ్యులు లాగా ఆదుకుంటారు. ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు అందాలని, మంచి ఆరోగ్యం ఉండాలని, నర్సులకు శిక్షణ ఇవ్వడం, రోగులకు రక్తం అందించేందుకు బ్లడ్‌బ్యాంకులు స్థాపించడం లాంటి కార్యక్రమాలతో ప్రజలకు, రోగులకు అండగా నిలుస్తారు. అలాంటి రెడ్‌క్రాస్‌కు మంత్రి నారాయణ వల్ల చెదలు పడుతోంది.

- నారాయణ ఆస్పత్రిలో రోగులను పెంచుకునేందుకు పావులు
- అందులో భాగంగా రెడ్‌క్రాస్ ఛైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డికి బెదిరింపులు
- విమర్శలకు తావివ్వకూడదని హుందాగా తప్పుకున్న ఛైర్మన్

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలో రెడ్‌క్రాస్ ద్వారా కేన్సర్ ఇన్‌స్టిట్యూట్, బ్లడ్‌బ్యాంకు, మానసిక దివ్యాంగుల కేంద్రం, ఏఆర్‌వీ సెంటర్, ప్రకృతి వైపరీత్యాల సంస్థ, జెనరిక్ మందులషాపు, పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమం, హెచ్ఐవీ క్లినిక్, మృతుల భౌతిక కాయాలకు ఉచిత ఫ్రీజర్ బాక్సులు, తలసేమియా రోగుల కేంద్రం, జూనియర్ రెడ్‌క్రాస్ ఇలా 13 ప్రాజెక్టులను మరింత దిగ్విజయంగా నిర్వహిస్తున్నారు. అన్ని పార్టీలకు చెందిన వారు రెడ్‌క్రాస్‌లో సభ్యులుగా ఉన్నారు. కమిటీ మెంబర్లుగా ఉన్నారు.

చంద్రశేఖర్‌రెడ్డి కాలంలో మరింత గుర్తింపు

పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి రెడ్‌క్రాస్ ఛైర్మన్‌గా ఎన్నికైన తర్వాత అందరినీ కలుపుకొంటూ సేవా కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టారు. కోవిడ్ సమయంలో బంధుమిత్రులు దగ్గరకు రాని సమయంలో కూడా కమిటీ సభ్యులే మృతదేహాలకు దహన సంస్కారాలు జరిపించారు. లాక్‌డౌన్ సమయంలో పెద్దాస్పత్రిలో రెడ్‌క్రాస్ వలంటీర్లు పనిచేశారు. ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్‌లను ఇళ్లవద్దకు చేర్చారు. వేలాది మంది ప్రయాణికులకు నెలరోజులకు పైగా ఉచిత భోజనాలు ఏర్పాటు చేశారు. నడిచిపోతున్న సుదూర ప్రాంతాల వారికి ప్రత్యేకంగా 13 బస్సులను ఏర్పాటు చేసి ఉచితంగా వారి స్వస్థలాలకు చేర్చారు. పెన్నానదికి వరదలు వచ్చినప్పుడు, జోరు వానలు కురిసి పేదలకు పనులు లేనప్పుడు పెద్ద ఎత్తున శిబిరాలు ఏర్పాటు చేసి ఆహార పదార్థాలు, వంట సామగ్రి అందేలా చేశారు. దీంతో నెల్లూరు రెడ్‌క్రాస్ సేవలకు దేశస్థాయిలో మొదటి స్థానంలో గుర్తింపు లభించింది.

గతంలో పెద్దాస్పత్రిని నిర్వీర్యం చేసిన మంత్రి

2014 నుంచి 2019 వరకు నారాయణ మంత్రిగా పనిచేశారు. అప్పట్లో పెద్దాస్పత్రికి అన్ని హంగులు కల్పిస్తానని, రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందేలా చేస్తానని చెప్పి అందుకు విరుద్ధంగా ప్రవర్తించారు. జిల్లా మంత్రి అయి ఉండి కూడా తన సొంత ఆస్పత్రిని అభివృద్ధి చేసుకున్నారు. పెద్దాస్పత్రిలో డాక్టర్లు, నర్సింగ్, పారామెడికల్ ఇలా అన్ని పోస్టులు ఖాళీగా పెట్టాడు. చివరికి నారాయణ ఆస్పత్రిలోని వారే పెద్దాస్పత్రి డాక్టర్లపై పెత్తనం చేశారు. రోగులకు కనీస వైద్యసేవలందక విలవిలలాడారు. అలాంటి మంత్రి ఇప్పుడు తన సొంత ఆస్పత్రి అభివృద్ధికి మరోదఫా ఆరాట పడుతున్నారు. ఇప్పుడు రెడ్‌క్రాస్‌ను చేజిక్కించుకోవాలని, రెడ్‌క్రాస్ కేన్సర్ ఆస్పత్రిని నిర్వీర్యం చేయాలని ఎంఓయూ రూపంలో ముందుకు వచ్చాడు. టీడీపీకి చెందిన వ్యక్తిని రెడ్‌క్రాస్ ఛైర్మన్ చేసేందుకు మంత్రి నారాయణ పావులు కదిపారు. తద్వారా తన పని సులభతరం చేసుకోనున్నారు. రెడ్‌క్రాస్ వంటి సేవా సంస్థల్లోకి నారాయణ లాంటి వ్యక్తులు ప్రవేశించడం ఎంత మాత్రం మంచిది కాదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

కలెక్టర్‌తో కమిటీ సభ్యుల సమావేశం

బుధవారం సాయంకాలం కలెక్టర్ ఆనంద్ రెడ్‌క్రాస్ కమిటీ సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. పొలిటికల్ నేపథ్యం ఉన్న వారు పదవుల నుంచి నిబంధనల ప్రకారం తప్పుకోవాలని కోరారు. అయితే చంద్రశేఖర్‌రెడ్డి రాజీనామా చేశాక ఎవరిని రెడ్‌క్రాస్ ఛైర్మన్‌గా ఎన్నుకుంటారనే చర్చ జరగలేదు.



నారాయణ ఆస్పత్రి కోసం రెడ్‌క్రాస్ నిర్వీర్యానికి కుట్ర

మంత్రి నారాయణ నిర్వహిస్తున్నది సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి. అయినా అక్కడ కేన్సర్ విభాగం లేదు. దీంతో మంత్రి కేన్సర్ విభాగాన్ని ఏర్పాటు చేసేందుకు పూనుకున్నారు. మెడికల్ అంకాలజీ, సర్జికల్ అంకాలజీ, రేడియేషన్ అంకాలజీకి చెందిన మూడు రకాల సేవలందిస్తేనే ఆరోగ్యశ్రీలో చేర్చుకుంటారు. నారాయణ ఆస్పత్రిలో ఇప్పట్లో రేడియేషన్ అంకాలజీ ప్రారంభించే పరిస్థితులు లేవు. రేడియేషన్ అంకాలజీ కోసం ప్రత్యేక బంకర్ ఏర్పాటు చేయాలి. నిర్మాణాలు జరగాలి. అందువల్ల రెడ్‌క్రాస్ కేన్సర్ ఆస్పత్రిని ఎంఓయూ పేరుతో చేజిక్కించుకోవాలని కుట్ర పన్నారు. ఎంఓయూకి రెడ్‌క్రాస్ కమిటీ సభ్యులు ఒప్పుకోలేదు. నారాయణ చేతిలో పడితే గతంలో పెద్దాస్పత్రిని నిర్వీర్యం చేసినట్టు చేస్తారని సభ్యులు పేర్కొన్నారు. దీంతో మంత్రి ఎలాగైనా చంద్రశేఖర్‌రెడ్డిని పదవి నుంచి తప్పిస్తే రెడ్‌క్రాస్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్‌ను హస్తగతం చేసుకోవచ్చని భావించారు. అందుకు తన అనుచరులతో బెదిరింపులు చేయించారు ఫోన్‌లు చేయించి భయపెట్టారు. చట్టబద్ధంగా ఎన్నికైనప్పటికీ రాజకీయ పార్టీలో ఉన్న వ్యక్తి పదవిలో ఉండటానికి వీలు లేదంటూ సోషల్ మీడియా ద్వారా విమర్శలు చేయించసాగారు. ఈ నేపథ్యంలోనే అధికార అహంకారంతో ఒత్తిడి తెచ్చి నిబంధనలకు విరుద్ధంగా రాష్ట్ర రెడ్‌క్రాస్ కమిటీ ద్వారా పదవి నుంచి వైదొలగాలంటూ చంద్రశేఖర్‌రెడ్డికి లెటర్ పంపారు. రెడ్‌క్రాస్‌లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. అవి 20 రోజుల్లో పూర్తి చేసి రాజీనామా చేస్తామని చంద్రశేఖర్‌రెడ్డి చెప్పినా మంత్రి నారాయణ ఆగలేదు. నిత్యం దుష్ప్రచారానికి తన అనుచరుల ద్వారా పూనుకున్నాడు. దీంతో విమర్శలకు తావివ్వకూడదని చంద్రశేఖర్‌రెడ్డి రాజీనామా చేశారు.

"విమర్శలకు తావివ్వకూడదనే రాజీనామా"



చట్టబద్ధంగా ఎన్నికైన కమిటీ నుంచి రెడ్‌క్రాస్ ఛైర్మన్‌గా తనను తొలగించే అధికారం ఎవరికీ లేదు. మంత్రి నారాయణ బెదిరింపులకు కూడా భయపడేది లేదు. అయితే అనవసరంగా విమర్శలకు తావివ్వకూడదనే ఉద్దేశంతోనే తాను ఛైర్మన్ పదవికి రాజీనామా చేశా. అయితే ఒక మేనేజింగ్ కమిటీ సభ్యునిగా రెడ్‌క్రాస్ సేవలను కొనసాగిస్తాను. రెడ్‌క్రాస్‌ను నిర్వీర్యం చేసే కుట్రను అడ్డుకుంటాను.

– పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ

ముగిసిన జాతీయ క్యారమ్ పోటీలు

గత నాలుగు రోజులుగా నెల్లూరు నగరంలోని నెల్లూరు క్లబ్‌లో జరుగుతున్న 29వ ఆలిండియా క్యారమ్ పోటీలు బుధవారంతో ముగిశాయి. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 350 మంది క్రీడాకారులు ఇందులో పాల్గొన్నారు.





వివరాలు 8లో

మహిళలు, పురుషులు విభాగాల్లో బుధవారం తలపడుతున్న క్రీడాకారులు

తల్లిదండ్రులపై కన్న కొడుకు దాడి



ఘటనా స్థలిలో మంచంపై శ్రీనివాసులు మృతదేహం, పక్కనే నేలపై రక్తగాయాలతో సుబ్బమ్మ



స్థానికులను విచారిస్తున్న డీఎస్పీ జి.శ్రీనివాసరావు

- తండ్రి మృత్యువాత, తల్లికి తీవ్రగాయాలు
- దామరమడుగులో ఘటన

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని దామరమడుగు గ్రామంలో మానసిక స్థితి సరిగాలేని ఓ యువకుడు చేసిన దాడిలో అతని తండ్రి మృతి చెందగా తల్లి తీవ్రంగా గాయపడింది. వివరాల్లోకి వెళితే.. గ్రామంలోని మతంకాలనీ (ఆర్ ఆర్‌నగర్)కి చెందిన అంతటి శ్రీనివాసులు, సుబ్బమ్మ దంపతులు, వారి కుమారుడు ఏడుకొండలు నివాసం ఉంటున్నారు. గత కొన్నేళ్లుగా ఏడుకొండలు మానసిక స్థితి సరిగాలేక తల్లిదండ్రులపై తరచూ దాడులు చేస్తుండేవాడు. నెల్లూరులోని ఓ మానసిక చికిత్సా కేంద్రంలో వైద్యం కూడా చేయించారు. అయినప్పటికీ అతని ప్రవర్తనలో మార్పు రాలేదు. ఈ నేపథ్యంలో బుధవారం కూలి పనికి వెళ్లి ఇంటికి వచ్చి పడుకున్న తల్లిదండ్రులపై ఏడుకొండలు పెద్ద కర్రతో దాడి చేశాడు. ఈ ఘటనలో తండ్రి శ్రీనివాసులు (57) అక్కడికక్కడే మృతిచెందగా తల్లి సుబ్బమ్మ తీవ్రంగా గాయపడడంతో 108 వాహనంలో నెల్లూరులోని ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి కూడా ఆందోళనకరంగా ఉన్నట్లు బంధువులు తెలిపారు. దాడి అనంతరం నిందితుడు పరారయ్యాడు. విషయం తెలిసిన వెంటనే డీఎస్పీ జి.శ్రీనివాసరావు, సీఐ, ఎస్సైలు ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల నుంచి వివరాలు సేకరించారు.

- ముగిసిన జాతీయ స్థాయి క్యారమ్ పోటీలు
- అట్టహాసంగా బహుమతి ప్రదానోత్సవం
- సింగిల్స్‌లో ఆంధ్రాకు టైటిల్
- విజేతగా నిలిచిన వైజాగ్ వాసి
- మహిళా విభాగంలో చిన్న వయసులోనే టైటిల్ సాధించిన పూజ

హోరాహోరీ పోరులో విజేతలై..



డబుల్స్ మహిళా విభాగంలో ట్రోఫీలు, నగదు బహుమతులు అందుకున్న వారు


పురుషుల విభాగంలో తొలి మూడు స్థానాల్లో నిలిచిన వారు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఆంధ్రప్రదేశ్ క్యారమ్ అసోసియేషన్, నెల్లూరు జిల్లా క్యారమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా నెల్లూరులో జరుగుతున్న 29వ ఆలిండియా క్యారమ్ పోటీలు బుధవారంతో ముగిశాయి. ఆఖరిరోజు ఫైనల్స్ నెల్లూరు క్లబ్‌లో హోరాహోరీగా జరిగాయి. 25 రాష్ట్రాలు, 10 కేంద్ర పాలిత ప్రాంతాలు, 9 కేంద్ర ప్రభుత్వ సంస్థల నుంచి 350 మంది క్రీడాకారులు సింగిల్స్, డబుల్స్ పురుషులు, మహిళల విభాగంలో తలపడ్డారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, అంతర్జాతీయ క్యారమ్ ఫెడరేషన్ అధ్యక్షుడు జోసెఫ్ మేయర్ (స్విట్జర్లాండ్) ముఖ్యఅతిథులుగా విచ్చేశారు.

- జోసెఫ్ మేయర్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ప్రపంచ వేదికపై జరిగే క్యారమ్ పోటీల్లో భారతదేశం విజయకేతనాన్ని ఎగురవేస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి సింగిల్ టైటిల్ విజేతగా జనార్దన్ నిలవడం హర్షణీయమన్నారు.
- ఎమ్మెల్యే వీరేశం మాట్లాడుతూ నిర్దిష్టమైన ఆలోచనతో సాధన చేస్తే విజయం తప్పనిసరిగా సొంతమవుతుందన్నారు. నెల్లూరు క్లబ్ క్యారమ్ జాతీయ స్థాయి పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రంలో కూడా పోటీలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో వివిధ క్యారమ్ అసోసియేషన్లకు చెందిన వీడీ నారాయణ, నీరజ్ కుమార్ సంపతి, భారతీ నారాయణ, అబ్దుల్ జలీల్, శ్రీమన్నారాయణ, శ్రీధర్, శ్రీనివాసులు, ఫెడరేషన్ కప్ కో – చైర్మన్ మలిరెడ్డి కోటారెడ్డి, ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మలిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నెల్లూరు క్లబ్ కార్యదర్శి పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, కోశాధికారి విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

70 ఏళ్ల తర్వాత..

ఆంధ్రప్రదేశ్‌లోని వైజాగ్‌కు చెందిన సీహెచ్ జనార్దన రెడ్డి సింగిల్స్ టైటిల్‌ను గెలుచుకున్నాడు. 70 సంవత్సరాల అనంతరం రాష్ట్రానికి జాతీయ స్థాయి టైటిల్ లభించడం విశేషం. గతంలో అప్పారావు మూడుసార్లు నేషనల్ ఛాంపియన్‌గా రికార్డు నెలకొల్పాడు.

విజేతల వివరాలు

- సింగిల్స్ విభాగంలో మన రాష్ట్రంలోని వైజాగ్‌కు చెందిన సీహెచ్ జనార్దనరెడ్డి అద్భుత ప్రతిభతో టైటిల్‌ను కైవశం చేసుకున్నాడు. రన్నరప్‌గా జెయిన్ ఇరిగేషన్‌కు చెందిన బీటీ సందీప్ దైవ్ రెండో స్థానంలో నిలిచారు. మహిళల సింగిల్స్ విభాగంలో పుదుచ్చేరికి చెందిన వి.పూజ టైటిల్ సాధించగా తమిళనాడుకు చెందిన ఇళవళగి రెండో స్థానంలో నిలిచారు.
- మహిళల డబుల్స్‌లో పీఎస్‌పీబీకి చెందిన కసీమా – వి.మిత్ర జట్టు విజేతగా, రన్నర్స్‌గా తమిళనాడుకు చెందిన బి.శోభిక – ఎస్.ప్రీతి ప్రిన్స్ జట్టు నిలిచింది.
- పురుషుల విభాగంలో ఆర్బీఐకి చెందిన జహీర్ బాషా – ప్రశాంత్ మోరే జట్టు ప్రథమ స్థానం, మహారాష్ట్రకు చెందిన వికాస్ హరీష్ దారియా – పంకజ్ అశోక్ పవార్‌లు ద్వితీయ స్థానం సాధించారు. వీరికి అతిథులు బహుమతులు అందజేశారు.

కష్టం ఫలించింది



చిన్నప్పటి నుంచి క్యారమ్స్ అంటే ఎంతో ఇష్టం. నాన్న చనిపోయిన తర్వాత ఎన్నో కష్టాలు పడ్డాం. జెరాక్స్ మెషీన్‌ను రిపేర్ చేస్తూ జీవితాన్ని సాగిస్తున్నాను. ఇప్పటికి వివిధ స్థాయిల్లో 17 రాష్ట్ర పతకాలను సాధించాను. 29వ ఆలిండియా ఫెడరేషన్ టోర్నమెంట్ విజేతగా నిలవడం ఆనందంగా ఉంది. అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ నీరజ్ కుమార్ సపంతి ప్రోత్సాహం మరువలేనిది. చాలా సంవత్సరాల తర్వాత జాతీయ స్థాయి చాంపియన్‌షిప్‌ను సాధించిన తెలుగువాడిగా గర్వపడుతున్నాను. రాబోయే రోజుల్లో అంతర్జాతీయ స్థాయిలో తెలుగుజాతి గౌరవాన్ని నిలబెడతా.

– సీహెచ్ జనార్దనరెడ్డి, నేషనల్ క్యారమ్ చాంపియన్

చిన్న వయసులోనే..

పుదుచ్చేరికి చెందిన పూజ వయసు 14 ఏళ్లు. పదో తరగతి చదువుతోంది. అతి చిన్న వయసులో జాతీయ చాంపియన్‌గా నిలిచి రికార్డు నెలకొల్పింది. తండ్రి వేలుమురుగన్ కూడా క్యారమ్ క్రీడాకారుడు. 25 సార్లు పుదుచ్చేరి చాంపియన్‌గా నిలిచారు. వృత్తి రీత్యా ఆటో డ్రైవర్. కష్టాలను అధిగమిస్తూ పెద్ద కుమార్తె వి.అదీనా, చిన్న కూతురు పూజాను క్యారమ్ క్రీడాకారిణులుగా తీర్చిదిద్దాడు.



కుటుంబ సభ్యులతో పూజ



సింగిల్స్ మహిళా విభాగంలో తొలి మూడు స్థానాల్లో నిలిచిన వారితో అతిథులు, నిర్వాహకులు


పురుషుల విభాగంలో ట్రోఫీలు అందుకున్న వారు, నిర్వాహకులు తదితరులు


బహుమతుల ప్రదానోత్సవానికి హాజరైన వారు

నేటితో ముగియనున్న దేహదారుఢ్య పరీక్షలు

- గైర్హాజరైన వారు నేడూ హాజరు కావొచ్చు


లాంగ్ జంప్ చేస్తున్న అభ్యర్థి

నెల్లూరు(క్రైమ్): కొలువే లక్ష్యంగా కానిస్టేబుల్ అభ్యర్థులు దేహదారుఢ్య పరీక్షల్లో పోటీపడుతున్నారు. నెల్లూరు పోలీసు కవాతు మైదానంలో గతనెల 30వ తేదీ నుంచి జరుగుతున్న ఈ పరీక్షలు గురువారంతో ముగియనున్నాయి. ఇప్పటి వరకు పరీక్షలకు గైర్హాజరైన వారందరూ చివరిరోజు హాజరు కావొచ్చని పోలీసు అధికారులు తెలిపారు. బుధవారం జరిగిన పరీక్షలకు 554 మంది హాజరయ్యారు. వారిలో 482 మందికి పరీక్షలు నిర్వహించారు. ఎస్పీ జి.కృష్ణకాంత్, ఏఎస్పీ సీహెచ్ సౌజన్యలు పర్యవేక్షించారు.

జాతీయ సైన్స్ ఫెయిర్‌కు జిల్లా ప్రాజెక్ట్



అతిథుల చేతుల మీదుగా జ్ఞాపిక అందుకుంటున్న విద్యార్థినులు

నెల్లూరు(టౌన్): తోటపల్లిగూడూరు మండలం కోడూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు బి.కీర్తిశ్రీ, డి.రాజశ్రీలు ప్రదర్శించిన నిత్య జీవితంలో త్రికోణమితీయ అనువర్తనాలు ప్రాజెక్ట్ జాతీయ స్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైంది. దీనికి గైడ్‌గా కామాక్షమ్మ వ్యవహరించారు. ఈనెల 7, 8 తేదీల్లో విజయవాడలోని మురళి రిసార్ట్‌లో రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్ జరిగింది. ఇందులో జిల్లా నుంచి ఆరు ప్రాజెక్ట్‌లను ప్రదర్శించారు. జాతీయ సైన్స్ ఫెయిర్‌కు త్రికోణమితీయ అనువర్తనాలు ఎంపికైంది. ఈనెల 20 నుంచి 25వ తేదీ వరకు పాండిచ్చేరిలో దీనిని ప్రదర్శించనున్నారు. కీర్తిశ్రీ, రాజశ్రీ, కామాక్షమ్మకు జిల్లా సైన్స్ అధికారి కరుణాకర్‌రెడ్డి బుధవారం అభినందనలు తెలిపారు.


జాతీయ స్థాయికి ఎంపికైన ప్రాజెక్ట్

చుక్కలదుప్పి మృతి

పొదలకూరు: మండలంలోని చాటగొట్లకు సమీపంలో చుక్కలదుప్పి చనిపోయి ఉండగా బుధవారం గుర్తించారు. నెల్లూరు నగరంలో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న వ్యక్తి చాటగొట్ల – బిరదవోలు మార్గంలో వెళ్తుండగా ఈ విషయాన్ని గుర్తించి అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. రోడ్డు ప్రమాదంలో దుప్పి మృతిచెంది ఉంటుందని భావిస్తున్నారు.

మత్స్యశాఖ అధికారుల తనిఖీలు


తనిఖీలు చేస్తున్న జేడీ నాగేశ్వరరావు

నెల్లూరు(సెంట్రల్): మత్స్యశాఖ అధికారులు, టాస్క్‌ఫోర్స్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నెల్లూరులో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆ శాఖ జాయింట్ డైరెక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ నగరంలోని రాజశేఖర్ ఆక్వా ఫీడ్స్ అండ్ కెమికల్స్ షాపును తనిఖీ చేయగా లైసెన్స్ లేకుండా వ్యాపారం చేస్తున్నట్లు గుర్తించామన్నారు. ఆరునెలల క్రితం లైసెన్స్ తీసుకోవాలని సూచించామన్నారు. గత వారం క్రితం కూడా నోటీసులిచ్చామని, స్పందించకపోవడంతో తనిఖీలు చేసినట్లు వెల్లడించారు. లైసెన్స్ లేనందున మొదటి తప్పిదం కింద రూ.25 వేలు జరిమానా విధించామన్నారు. ఆక్వా సాగులో నిషేధిత యాంటీ బయోటిక్స్ వాడినా, విక్రయించినా చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. తనిఖీల్లో అధికారులు వీవీఆర్ బాబు, కీర్తి, సంజయ్ స్టీఫెన్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పెంచలకోన ఆలయానికి ఆదాయం


వేలం పాటలు నిర్వహిస్తున్న అధికారులు

రాపూరు: మండలంలోని పెంచలకోన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం నిర్వహించిన సీల్డ్ టెండర్లు, బహిరంగ వేలం పాటల్లో భారీ ఆదాయం వచ్చినట్లు ఏసీ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ 2025 – 26 ఆర్థిక సంవత్సరానికి గానూ టెండర్ల ప్రక్రియ నిర్వహించామన్నారు. టెంకాయలు, పూజాద్రవ్యాలు విక్రయించేందుకు రూ.72.80 లక్షలు, కొబ్బరి చిప్పలు పోగు చేసుకునేందుకు రూ.35.20 లక్షలు, టోల్‌గేట్ రుసుము వసూలుకు రూ.27.10 లక్షలు, వస్త్రాలు సేకరించే హక్కుకు రూ.11 లక్షలు, చెప్పులు భద్రపరిచేందుకు రూ.5.65 లక్షలు, పుష్పాలు విక్రయించేందుకు రూ.12 లక్షలు వచ్చినట్లు వెల్లడించారు. గత సంవత్సరం కంటే రూ.31.72 లక్షలు అధికంగా వచ్చిందన్నారు.

తాగునీటి పథకం పరిశీలన

రాపూరు: మండలంలోని పోకూరుపల్లిలో ఉన్న సమగ్ర రక్షిత తాగునీటి పథకాన్ని బుధవారం జెడ్పీ సీఈఓ విద్యారమ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో మంచినీటి సమస్యను అధికారుల దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటారన్నారు. పోకూరుపల్లి ఎస్టీకాలనీకి పైపులైన్ ద్వారా నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. ఇందుకోసం రూ.4 లక్షలు మండల పరిషత్ నిధులను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ ప్రసన్న, ఎంపీడీఓ భవానీ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మోహన్‌రావు, ఏఈ ఆంజనేయులు, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పిండి వంటలు చేస్తున్న మహిళలు

సంప్రదాయ ఘుమఘుమలు

- పల్లెల్లో సంక్రాంతి కళ
- వ్యవసాయ పనులు మానుకుని వంటకాలు
- మహిళలంతా ఒకేచోట చేరి వంటలు


అరిసెలు తయారు చేస్తున్న మహిళలు

పొదలకూరు: సంక్రాంతి సందర్భంగా పల్లెసీమలు కొత్త కళను సంతరించుకున్నాయి. ఈ పండగకు కొద్దిరోజుల ముందు నుంచే బంధువుల రాక మొదలైంది. మహిళలంతా కలిసి పిండి వంటల తయారు చేస్తూ సందడి చేస్తున్నారు. సంప్రదాయ వంటల్లో అరిసెలు ముందు వరుసలో ఉంటాయి. తర్వాత లడ్డూలు, మైసూరు పాక్, కజ్జికాయలు, జిలేబి, కొబ్బరి అరిసెలు, ఉప్పుచెక్కలు, మనూబూలు (జంతికలు) తదితర పిండి వంటలు తయారు చేస్తుంటారు. ఇంకా బంధువులకు పంపడం అనాదిగా వస్తున్న ఆచారం. మరికొద్దిరోజుల్లో పండగ ఉన్న నేపథ్యంలో గ్రామాల్లో మహిళలు పొయ్యి వద్ద చేరి తలో చెయ్యేసి వంటలు చేస్తున్నారు. సీజన్లో వరి సాగు చేస్తూ కలుపు తీయడం, మందు పిచికారీ చేయడం వంటి పనులున్నా.. వీలు చూసుకుని అరిసెల తయారీలో నిమగ్నమయ్యారు. ఎన్ని పనులున్నా, ఎంత దూరంలో ఉన్నా కొత్త అల్లుళ్లు అత్తవారింటికి వచ్చి వారి ఆతిథ్యం స్వీకరించడం సంప్రదాయంగా వస్తోంది.



ప్రతి ఏడాది వస్తుంటాం



ప్రతి ఏడాది సంక్రాంతి సందర్భంగా మా సోదరి ఇంటికి వస్తుంటాం. పిండి వంటల్లో సహకరిస్తూ సంక్రాంతి పండగను ఆస్వాదించడం జరుగుతుంది. బంధువులతో ముచ్చట్లతో సరదాగా గడిపి వెళ్తుంటాం.

– జగదీశ్వరి, ప్రొద్దుటూరు

వంటల తయారీలో సహకరిస్తాం



బంధువులు చేసే పిండి వంటకాల్లో సహకరిస్తాం. సంక్రాంతి సందర్భంగా వారిని కలిసి ఆనందంగా గడిపి వెళ్లడం ఆనవాయితీగా మారింది. సంక్రాంతి అంటేనే వారం రోజుల నుంచే హడావుడి మొదలవుతుంది. చక్కటి పిండి వంటకాలను తయారు చేసుకుంటాం.

– సుభాషిణి, నెల్లూరు

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.29
సన్నవి : రూ.23
పండ్లు : రూ.12

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	120
లేయర్ (లైవ్)	85
బ్రాయిలర్ చికెన్	218
బ్రాయిలర్ స్కిన్‌లెస్	240
లేయర్ చికెన్	145



పండగ వాతావరణంలో..



సంక్రాంతి పండగ వస్తుందంటనే పిండి వంటకాలు గుర్తుకొస్తాయి. సిటీలో చేసుకునేందుకు సౌకర్యవంతంగా లేకుంటే గ్రామీణ ప్రాంతాల్లో బంధువుల ఇళ్లకు వెళ్తుంటాం. పండగ వాతావరణంలో బంధువులు, స్నేహితుల మధ్య వంటకాలు చేయడం బాగుంటుంది.

– లావణ్య, నెల్లూరు

బంధువులను ఆహ్వానిస్తుంటాం



సంక్రాంతి పిండి వంటకాలంటే మహిళలంతా ఒకచోట చేరుతారు. కబుర్లు చెప్పుకొంటూ వంటకాలను పూర్తి చేయడంలో ప్రత్యేక అనుభూతి ఉంటుంది. మాది పెద్ద కుటుంబం కావడంతో బంధువులను ఆహ్వానిస్తుంటాం.

– శిరిషా, పొదలకూరు